ప్రజాశక్తి

ఆదివారం 7 డిసెంబరు, 2025

ఇద్దరు కార్యదర్శులు సస్పెన్షన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని మండపల్లి పంచాయతీ కార్యదర్శులు గురుమూర్తి, ఎస్.కృష్ణలను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిపాలనకు సంబంధించి రికార్డుల్లో తారుమారు, ఆర్థిక వ్యవహారాల్లో తేడాలు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి భారతీసౌజన్య సస్పెండ్ చేసినట్లు తమకు ఉత్తర్వులు అందాయని అన్నారు. ఈ మేరకు ఇద్దరినీ సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

ఎచ్చెర్లలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న అధ్యాపకులు

శత శాతానికి 'సంకల్ప్'

- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి
- ఫిబ్రవరి 20 వరకు అమలు

ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు సంకల్ప్ -2026 అమలు చేస్తుంది. 50 రోజులు ఈ ప్రత్యేక ప్రణాళికలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నవంబరు 24 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వచ్చేదాది ఫిబ్రవరి 20 వరకు అమలు చేయనున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 6503, రెండో సంవత్సరంలో 6313 మంది చదువుతున్నారు. 12,816 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. గతేడాది మొదటి సంవత్సరంలో 53 శాతం, రెండో సంవత్సరంలో 65 శాతం ఫలితాలు సాధించారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాల కోసం పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. విద్యార్థులు వ్యక్తిగత అధ్యయనం లక్ష్యంగా సంకల్ప్ కార్యాచరణ ముందుకు సాగుతుంది.

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, వృత్తి విద్యా కోర్సు ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి 24 వరకు నిర్వహిస్తారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

కళాశాల యూనిట్‌గా విద్యార్థులను ప్రతిభా ఆధారంగా మెరుగైన విద్యార్థులు, సాధారణ విద్యార్థులు, వెనుకబడిన విద్యార్థులు ఇలా ఎ,బి,సి గ్రేడ్‌లుగా విభజించారు. ఎ-గ్రేడ్ విద్యార్థులను 90 శాతం మార్పులు దాటి ఎలా తీర్చిదిద్దటం... సాధారణ విద్యార్థులు కనీసం 60 శాతం మార్పులు దాటేలా, వెనుకబడ్డ విద్యార్థులు 50 శాతం మార్పులు దాటేలా తీర్చిదిద్దనున్నారు. జిల్లాలో ప్రధానంగా ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసి, కొన్ని కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. కెమిస్ట్రీ, ఫిజిక్స్ మ్యాథ్స్, ఇంగ్లీస్ వంటి సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

అందరు విద్యార్థులు ఉత్తీర్ణులు కావడమే లక్ష్యంగా రోజూ సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. క్యాటగిరీలుగా విభజించిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతునానరు. ఇప్పటికే అన్ని కాలేజీల్లో గత నెల 20 నాటికి సిలబస్ పూర్తి చేశారు. కొన్నిచోట్ల పెండింగ్ ఉంటే ఈ నెల 12 లోప సిలబస్ పూర్తి చేసి రివిజన్ ప్రారంభించే చర్యలు చేపడుతున్నారు. మరో పక్క ఎ-గ్రేడ్ విద్యార్థులకు జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఎపిఇఎపి సెట్-26 సైతం సెక్షన్ ఇస్తున్నారు. విద్యార్థులు వ్యక్తిగత ప్రతిభ తెలుసుకునేందుకు స్లిప్ టెస్టులు పెడుతున్నారు.

విద్యార్థులు చదివించేందుకు అధ్యాపకులను కేర్ టేకర్లగా నియమించారు. సబ్జెక్టులు వారిగా విద్యార్థుల ప్రదర్శన తెలుసుకోవడం, వెనుకబడ్డ సబ్జెక్టు పురోగతికి ప్రత్యేక తర్ఫీదునివ్వడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కనీసం పాస్ మార్క్ దాటేలా వెనుకబడిన విద్యార్థులను మోడల్ ప్రశ్నపత్రాలతో సన్నద్ధం చేస్తున్నారు. అర్ధసంవత్సర పరీక్షల ఫలితాలను మదింపు సేసి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. ఈ అంచనాతో ప్రత్యేక శిక్షణ కొనసాగిస్తున్నారు. మరోపక్క పక్కాగా స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేసి చదివిస్తున్నారు. వ్యక్తిగత విద్యాప్రగతి మదింపు లక్ష్యంగా సంకల్ప్-26 కార్యాచరణ ప్రణాళిక కొనసాగుతుంది. నిరంతరం ఉన్నతాధికారులు కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, విద్యార్థుల ప్రగతి, ఉత్తీర్ణత శాతం మెరుగుకు తీసుకుంటున్న చర్యలు, కేర్ టేకర్ల వ్యవస్థ పనితీరు పర్యవేక్షిస్తున్నారు.

శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ ఇంటర్ విద్యార్థులు

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

ఇంటర్మీడియట్లో 2026 వార్షిక పరీక్షల్లో శత శాతం ఫలితాల లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. సంకల్ప్ కార్యక్రమం విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రభుత్వ కళాశాల బలోపేతం చెందాలంటే మెరుగైన ఉత్తీర్ణత శాతం అవసరం. సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులు మెరుగైన ఫలితాల సాధనకు ఉపయోగపడతాయి.

- రేగ సురేష్ కుమార్, డివిఇఒ

పక్కా ప్రణాళికతో ముందుకు...

కాలేజ్ యూనిట్‌గా విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించాం. ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం. వ్యక్తిగత మదింపులో లోపాలు గుర్తించి, వెనుకబడిన సబ్జెక్టుపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై దృష్టిపెట్టాం. పరీక్షల్లో వారు ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

- పల్లి శైలజ, ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రబీలో వరి వేయొద్దు

- ఆరు తడి పంటలకే సాగునీరు
- షట్టర్ల సమస్యకు త్వరలో పరిష్కారం
- ఆఫ్‌షోర్‌లో పరిహారం చెల్లించిన ఇళ్లను పడగొట్టండి
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రబీలో వరి వేయొద్దని, నీళ్లు రాలేదంటే తమది బాధ్యత కాదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన 32వ నీటి పారుదల సలహా మండలి సమావేశంలో మాట్లాడారు. రబీ సీజన్‌లో వరి కాకుండా ఇతర ప్రత్యామ్నయ పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. డిస్ట్రిబ్యూటరీ, నీటి వినియోగదారుల సంఘాలు సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వంశధారకు ఈ ఏడాది వరదలు వచ్చినా కాట్రగడ సైడ్‌వియర్ ద్వారా హిరమండలం రిజర్వాయరును నింపలేకపోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. సైడ్‌వియర్ పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు ఆపరేట్ చేయడం, అక్కడి అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా సైడ్‌వియర్‌లో పూడిక తొలగింపు, రిజర్వాయరులోకి నీరు వెళ్లేలా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సూచించారు. హిరమండలం వద్ద నిర్మిస్తున్న నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పరిస్థితి ఏమిటని, రాబోవు ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఏపి ట్రాన్స్‌కోకు రూ.9.12 కోట్ల చెల్లించాల్సి ఉంటుందని వంశధార అధికారులు చెప్పగా ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే అనుమతి వచ్చేలా చూస్తానని చెప్పారు. గొట్టాబ్యారేజీ వద్ద దెబ్బతిన్న అప్రాన్ నిర్మాణంపై మంత్రి అడిగిన ప్రశ్నకు అధికారులు బదులిస్తూ పనులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించిందని వంశధార ఎస్ఇ రామచంద్రరావు చెప్పారు.

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 పనుల పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు అడిగిన ప్రశ్నకు ప్రస్తుతం పనుల జరుగుతున్న పరిస్థితిని అధికారులు వివరించారు. 87 ప్యాకేజీ పనులు చూస్తున్న ఏజెన్సీ పనులు ముగింపునకు దరఖాస్తు చేసుకుందని చెప్పారు. 88 ప్యాకేజీ పనులు భూసేకరణ వల్ల ఆగిందని, రైతులకు రూ.3.17 కోట్లను చెల్లించాల్సి ఉందని చెప్పారు. షట్టర్ల పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు అడిగిన ప్రశ్నకు అధికారులు బదులిస్తూ కేసులను అలానే ఉంచి, షట్టర్ల ఏర్పాటుకు అధికారులు అంగీకారం తెలిపారని ఎస్ఇ రామచంద్రరావు బదులిచ్చారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ షట్టర్లకు అనుమతితో పాటు వాటి ఏర్పాటుకు అవసరమయ్యే ఖర్చుతో అంచనాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. వంశధార వరదల సమయంలో జిల్లాలో మూడుచోట్ల గండ్లు పడ్డాయని, అది ఇంజినీరింగ్ అధికారులు వైఫల్యమని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆఫ్‌షోర్ గ్రామాల్లో ఇళ్లను పడగొట్టండి

ఆఫ్‌షోర్‌లో పరిహారం పూర్తిగా చెల్లించిన ఇళ్లను దశల వారిగా కూలగొట్టాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని ఆదేశించారు. చీపురుపల్లిని ఖాళీ చేయించాలని చెప్పారు. నిర్వాసితుల్లో ఎవరెవరికి డబ్బులు చెల్లించాలో పరిశీలించి దశల వారిగా కూలగొట్టాలని సూచించారు. ఆఫ్‌షోర్ పనులు ఈ సీజన్‌లో 70 శాతం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

అధికారులపై ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం

హైలెవల్ కెనాల్‌కు సంబంధించి అంచనాలను రూపొందించడంలో అధికారుల తీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో మిగిలిన పనులకు, ఓపెన్‌హెడ్ ఛానల్‌కు ఎంతేసి మొత్తంలో అంచనాలను పంపారని ఎమ్మెల్యే రవికుమార్ అడిగిన ప్రశ్నకు అధికారులు సరిగా సమాధానం చెప్పకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారుల్లో ఇంత నిర్లక్ష్యం పనికి రాదని, వీరితో పనులు కొనసాగించలేమని చెప్పారు. అంచనాల రిపోర్టుతో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించిన పలు సాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే గొండు శంకర్ లేవనెత్తారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పలాస నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వంశధార, నారాయణపురం ప్రాజెక్టుల చైర్మన్లు అరవల రవీంద్ర, సనపల ఢిల్లీరావు, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, పలు డిస్ట్రిబ్యూటరీ, సాగునీటి సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ అందరివాడు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి వేడుకలను నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ ప్రజాస్వామ్యాలన్నింటిలోనూ అత్యున్నత స్థానాన్ని పొందిందని అన్నారు. దేశం సృష్టించిన సమానత్వ భావనను అంబేద్కర్ ముందుగానే దర్శించారని దేశంలో 70 ఏళ్ల ప్రజాస్వామ్య ప్రయాణం పూర్తవుతుందని అన్నారు. బాబాసాహెబ్ చూపిన మార్గమే పీడిత, వంచిత వర్గాల అభ్యుదయానికి శ్రేయస్కరమని అన్నారు. సమాన అవకాశాలకు మార్గం సుగమం చేసిన అంబేద్కర్ సేవలను ప్రతి ఒక్కరికీ చేరవేయడమే సమాజం పాలక తరగతుల బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, వంశధార ప్రాజెక్టు చైర్మన్ ఎ.రవీంద్రబాబు, ఆర్‌డిఒలు కె.సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పోలీసు వ్యవస్థలో నీతి నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించాలని కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని తండేవలస వద్ద ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం మైదానంలో శనివారం 63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా పరేడ్ కమాండర్ హోంగార్డు శశి భూషణ్ ఎస్‌పికి గౌరవ వందన్నాన్ని సమర్పించారు. అనంతరం పరేడ్ కమాండర్ ఆధ్వర్యాన నిర్వహించిన రైజింగ్ డే పరేడ్‌ను పరిశీలించారు. శాంతి సూచకంగా బెలూన్లు, పావురాలను గాల్లోకి వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1962లో కొద్ది మందితో స్వచ్ఛంద సంస్థగా ఏర్పడిన హోంగార్డు ఆర్గనైజేషన్ ప్రస్తుతం జిల్లాలో 699 మంది మహిళా, పురుష హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విధులపై నిబద్ధత, సమయపాలన, ధైర్యమే సిబ్బందికి ప్రత్యేకంగా నిలబెడుతున్న లక్షణాలు అని తెలిపారు. అరసవిల్లిలో రథసప్తమి, జలుమూరు మండలం శ్రీముఖలింగం ఆలయాల్లోని వేడుకలకు బందోబస్తు, ఎన్నికలు, ర్యాలీలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అత్యవసర సమయంలో ముందుండి పనిచేస్తూ, ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని అన్నారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో, కఠిన పరిస్థితుల్లో కూడా తమ విధులను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలోనూ, విపత్తుల సమయంలో సహాయక చర్యల్లోనూ, ప్రజలకు చేరువగా ఉంటున్నారని తెలిపారు. అలాగే హోంగార్డులు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. అనంతరం పరేడ్‌లో 4వ ప్లాటూన్ మొదటి బహుమతి గెలుచుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పరేడ్ కమాండర్, ప్లాటూన్ కమాండర్, సిబ్బందికి ఎస్‌పి మెడల్స్‌తో సత్కరించారు. అలాగే ఇటీవల విశ్రాంత హోంగార్డు రమణమూర్తికు జిల్లాలోని హోంగార్డ్లు ఒక్కరోజు గౌరవ వేతనం రూ.4.18 లక్షలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జిల్లా ఎస్పీ వారి కుటుంబ సభ్యులకు అందశేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి సిహెచ్. వివేకానంద, ఎఒ సిహెచ్.గోపీనాథ్, సిఐలు ఇమ్మాన్యుల్‌రాజు, పైడిపు నాయుడు, ఈశ్వరరావు, అవతారం, సూర్యచంద్రమౌళి, సన్యాసినాయుడు, సత్యనారాయణ, ఆర్‌ఐలు నర్సింగరావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం తండేవలసలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు.

గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

దళారులను ఆశ్రయించవద్దు

ప్రభుత్వ విప్ అశోక్

సోంపేట : ధాన్యం కనీస మద్దతు కోసం ప్రభుత్వం నిర్ణయించిన వివిధ నాణ్యత ప్రమాణాలకు లోబడి రైతు సేవా కేంద్రాల వద్దని ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు దళారులు ఆశ్రయించ వద్దని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. సోంపేట వ్యవసాయ కార్యాలయం, రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. అనంతరం ట్రక్కులను జెండా ఊపి మిల్లులకు పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కేంద్రాల వద్ద నియమించిన సిబ్బంది వద్దనే రైతు పని పూర్తవుతుందని అన్నారు. అనవసరంగా రైతులు ఎవరు మిల్లు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. డబ్బు కూడా రైతు ఖాతాల్లో 24 గంటల లోపల జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రైతులు ఎవరూ మధ్యవర్తులు బారిన పడవద్దని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షులు భిన్నల జగన్నాథరావు, ప్రత్యేకాధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు టి.భవానీశంకరరావు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, సచివాలయాల అధికారి శాంత కుమారి, ఎఒ బి.నరసింహమూర్తి, డిటి కుర్మారావు, కొనుగోలు కేంద్రాల నిర్వహక ప్రతినిధులు నారాయణరావు, రాజేష్, ప్రియాంక పాల్గొన్నారు.

జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న అశోక్

నేడు ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్ష

- జిల్లాలో 28 కేంద్రాలు
- హాజరుకానున్న 5,400 మంది విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయి ఉపకార వేతనం మంజూరుకు నిర్వహించనున్న ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ ప్రతిభా పరీక్షకు జిల్లాలోని శ్రీకాకుళం, పలాస, టెక్కలి విద్యాశాఖ డివిజన్ పరిదిలో 28 పరీక్షా కేంద్రాలు కేటాయించారు. వీటి ద్వారా జిల్లాలో సుమారు 5,400 మంది హజరు కానున్నట్లు విద్యాశాఖ అధికారులు అంచనా. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. జాతీయ ఉపకార వేతనం ఎంపిక నిమిత్తం నిర్వహించనున్న ఈ పరీక్షకు సంబంధించిన విద్యార్థుల హాల్ టిక్కెట్లు ఇప్పటికే జారీ అయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రశ్న పత్రాలు వారం రోజులు ముందుగానే ఆయా పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి. పరీక్షకు సంబంధించి చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ఇన్విజిలేటర్లుగా ఎస్‌జిటి, వ్యాయామ ఉపాధ్యాయులనే నియమించనున్నారు. టెక్కలి డివిజన్ పరిధిలో ఆరు కేంద్రాల ద్వారా 1600 మంది విద్యార్థులకు కేటాయించారు. పలాస డివిజన్ నుంచి 8 కేంద్రాల ద్వారా 1800 మంది విద్యార్థులకు కేటాయించారు. శ్రీకాకుళం డివిజన్ నుంచి 14 కేంద్రాల్లో 2,028 మంది విద్యార్థులకు కేటాయించారు. ఈ జాతీయ ప్రతిభా పోటీ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థికి ఇంటర్మీడియట్ చదువు వరకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా స్కాలర్‌షిప్ మంజూరు చేయనుంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను విద్యాశాఖాధికారులు చేపట్టారు.

పాలనలో పక్షపాతమేల?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న నేతలు రాష్ట్ర మంత బాగుండాలని కాంక్షించాలి. ఆ నేత జిల్లాకు చెందిన వ్యక్తి అయితే జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజల మేలు కోరాలి. తన నియోజకవర్గమే అభివృద్ధి చెందాలి, అక్కడ ప్రజలే బాగు పడాలని స్వార్థపూరిత వైఖరితో వెళ్తే అది ప్రాంతాల మధ్య అసమానతలకు దారి తీస్తుంది. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రేగుతుంది. అది చివరికి ఆ నేత ప్రాతినిధ్యం వహించే పార్టీకే తీవ్ర నష్టం కలిగిస్తుంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలను మూట గట్టుకుంటున్నారు. అన్ని ప్రభుత్వశాఖల నుంచి కోట్లాది రూపాయలను టెక్కలి నియోజకవర్గంపై కుమ్మరించడం మనం చూస్తున్నాం. చివరకు తుపాను సాయం అందించే విషయంలోనూ ప్రాంతాల మధ్య, మత్స్యకారుల మధ్య తీవ్ర వివక్ష కనబరుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల సంభవించిన మొంథా తుపాను ప్రభావంతో చేపల వేట సాగక జిల్లాలోని 11 మండలాల మత్స్యకారులు ఉపాధి కోల్పోయితే పరిహారాన్ని తన నియోజకవర్గంలోని వారికి అందరికీ ఇచ్చి మిగిలిన నియోజకవర్గాల్లో జాబితాల ఆధారంగా ఇవ్వాలని చెప్పడం అమాత్యుల పక్షపాత వైఖరికి అద్దం పడుతోంది. జిల్లాలో 11 మండలాల పరిధిలో 91,961 మంది మత్స్యకారులు ఉంటే తన నియోజవర్గంలోని నాలుగు మండలాల్లోని 11 మత్స్యకార గ్రామాలకు చెందిన 4,030 కుటుంబాలకు పరిహారం కింద ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం ఇప్పించారు. జాబితాలో ఉన్నా లేకపోయినా అందరికీ పరిహారం అందించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలోని ఇతర ప్రాంతాల మత్స్యకారులపై ఆ విధమైన విశాల దృక్పథం చూపకచూపడం వివక్ష కనబరచడమే అవుతుంది. తుపాను ప్రభావంతో మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని ప్రభుత్వమే చెప్పిన నేపథ్యంలో జీవనోపాధి కోల్పోయిన వారందరికీ పరిహారం అందించే బాధ్యతను మత్స్యశాఖ మంత్రిగా ఆయన చూడాల్సి ఉంది. అలా కాకుండా వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ఒక దృఢమైన పునాది ఏర్పాటు చేసుకోవడానికో, లేక ఓటు బ్యాంకు మరింత పటిష్టపరుచుకోవాడానికో ఈ నిర్ణయం తీసుకోవడం ఆయన ఆశించిన ఫలితం ఆయనకు దక్కొచ్చు. కానీ, ఇది పార్టీకి, ప్రభుత్వానికి నష్ట తెస్తుందన్న విషయాన్ని విస్మరించినట్టుంది. ఇది టిడిపి నుంచి మత్స్యకారులు దూరమయ్యే అవకాశాలూ లేకపోలేదు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణలోనూ వివక్ష చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాబాయ్, అబ్బాయ్‌లు ఇరువురూ సామాన్య ప్రజల మొర వినడానికి ఇష్టపడటం లేనట్టుగా కనిపిస్తోంది. తమ క్యాంప్ కార్యాలయాల్లో వినతులను స్వీకరిస్తున్నారంటే ఎవరి సమస్యలు వినడానికో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. సాధారణ ప్రజానీకానికి క్యాంప్ కార్యాలయం మెట్లు తొక్కే అవకాశం ఎక్కడుంది?. టిడిపి చెందిన ఎవరో చోట మోటా నాయకుడో, అమాత్యులకు రెండు ఓట్లు వేయించే నాయకుడో రికమెండేషన్ చేయాలి. వారికి నచ్చిన వారిని మంత్రివర్యుల ముందు పెడతారు. అంటే కొంత మందికే సమస్యలు చెప్పుకునే అవకాశం ఉంటోందన్న మాట. పోనీ ఇరువురు మంత్రులు క్యాంప్ కార్యాలయంలో వినతులు తీసుకుంటున్నట్టు తెలిస్తే మంత్రిగారి అంగరక్షకుడిని బతిమిలాడో ఏదో విధంగా లోపలకి వెళ్లి తమ మొర చెబుదామని అనుకున్నా అసలు ఇరువురు మంత్రులు వస్తున్నట్టు కూడా ఎవరికీ తెలియడం లేదు. అమాత్యులు ఆయా క్యాంప్ కార్యాలయాల్లో వినతులు స్వీకరిస్తున్న సమయంలో మాత్రం నాయకులు, కార్యకర్తలు భారీగా కనిపిస్తుంటం గమనార్హం. అమాత్యుల రాకపై వారికి కచ్చితమైన సమాచారముంటున్నట్టుగా కనిపిస్తోంది. ఎన్నికల తర్వాత గెలిచిన నేతలు ప్రజల అందరి సమస్యలను వినేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి తప్ప కొందరికే పరిమితం అది ప్రజల్లో అసంతృప్తి, అసహానానికి దారి తీస్తుంది. అది టిడిపికే చేటు తెస్తుందన్న విషయం గుర్తెంచాలి. ప్రజల అందరి ఉమ్మడి వేదికగా ఉన్న జెడ్‌పి గ్రీవెన్స్‌కు నెలలో కనీసం ఒకసారైనా సమయం కేటాయిస్తే సాధారణ ప్రజల సమస్యలేమిటో, వారి బాధలేమిటో తెలుస్తాయి. అలా కాకుండా కార్యకర్తలకు పనులు చేసి పెట్టడం తప్ప మిగిలిన వారితో తమకు సంబంధమేమిటన్న రీతిలో వ్యవహరిస్తే ప్రజలు ప్రతి అంశాన్నీ గుర్తుంచుకుంటారు. సరియైన సమయంలో తగు రీతిలో ప్రతిస్పందిస్తారు.

IN THE HON BLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) ITCHAPURAM
E.P. 8/2025 in O.S. 33/21019

Patana Rukmangadhara Reddy
.....Decree Holder
Vs
Vikram Kesari Das
.....Judgement Debtor

NOTICE

To,
Kesari Vikram Das, S/o Judisti Das, Door No 1-317, Patha Kojjaria village, Post Rajapuram Kaviti Mandal.

Please take notice that the petitioners filed the above petition For realisation of the decretal from you and you are the judgment debtor in the above petition You are avoiding to take summons sent by the Hon Ble Court and even though notices were sent for several times. The case stands posted to **10-12-2025 at 10.30 A.M.,** for your appearance before the Hon Ble Court at and failing which the matter will be decided in your absence.

VINAYA C. PATNAIK
ADVOCATE, SOMPETA
SRIKAKULAM (DIST), A.P.
CELL: 9440106427.

అంబేద్కర్ ఆదర్శనీయుడు

ఆమదాలవలస : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రణస్థలం : అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కిరణ్ కుమార్

ఆమదాలవలస: అంబేద్కర్ ఆశయాలు దేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత స్ఫూర్తి అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అంబేద్కర్ 69వ వర్ధంతి నిర్వహించారు. రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ తోటరాము ఆధ్వర్యంలో ప్రజలు, దళిత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రవికుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, నూక రాజు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ నివాళ్లర్పించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లావేరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి హెచ్‌ఎం పసుపుల జగన్నాథం పూలమాలన వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షులు పిసిని వసంతరావు, ఉపాధ్యాయులు కూన నారాయణ బాబు, కోట్ల సూర్యనారాయణ, వంబర సూర్యనాగరాజు, జర్జాన సుదర్శనం, శివ్వాల పుణ్యవతి, గోగుల ఉషారాణి, బలివాడ సత్య సుజన, జల్లేపల్లి శోభారాణి, సూర సత్యవతి, మురపాక శైలజ, కామేశ్వరరావు, టొంపల నాగార్జున, బమ్మిడి చిదంబరేశ్వర రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణ సమీపంలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సునీల్‌కుమార్, ఎంఇఒ పట్నాన రాజారావు, రేగడి గవర్రాజు, ఎస్‌సి ఎంప్లాయ్ అసోసియేషన్ సభ్యులు పోతయ్య, బంగారి వెంకటరావు, నాగరాజు, రేగడి శ్రీను, పట్నాన పైడిరాజు, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పిసిని జగన్నాథం నాయుడు, బాలి శ్రీను, వెలిచేటి రామకృష్ణ, బాలి రామునాయుడు, పల్లిశెట్టి సూర్యనారాయణ, దన్నాన స్వామినాయుడు, గోపిన కృష్ణారావు, లోచర్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాంరూరల్ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు పైల విష్ణుమూర్తి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీశంకరరావు, వజ్జపర్తి రఘురాం, త్రినాథరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం శ్రీకాకుళం ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు డి.సూర్యుడమ్మ, టి.ప్రవీణ, ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కమిటీసభ్యులు డి.లక్ష్మి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

వైసిపి కార్యాలయంలో...

జిల్లా వైసిపి కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.
అలాగే దళిత ఆదివాసి బహుజన మైనార్టీ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. మధుసూదనరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద, వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి ని వాళ్లర్పించారు. ఎంపిపి ముద్దాడ భైరాగి నాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, రాష్ట్ర రైతుకార్యదర్శి కనపల శేఖర్‌రావు పాల్గొన్నారు.

మందస : ముకుందాపురంలోని అంబేద్కర్ విగ్రహానికి కొత్తపల్లి సర్పంచ్ ప్రతినిధి సేనాపతి మురళి పూలమాలలు వేసి నివాల్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, గ్రామస్తులు కె.తిరుపతిరావు, గోపి, వాసుదేవరావు, చంద్రశేఖరం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దువ్వారపు సింహాచలం, దళిత నాయకులు కూన మల్లేశ్వరావు, కాళ్ల సంజీవరావు, అక్కురాడ సురేష్, బమ్మిడి వేణు, చల్ల చిరంజీవి, సామ సంజీవరావు, దువ్వారపు సింహాచలం, చింతల సింహాచలం, కరజాన భాస్కరరావు, బోకర సిమ్మయ్య, చల్ల రామారావు పాల్గొన్నారు.

కవిటి: నేటి తరానికి అంబేద్కర్ ఆదర్శనీయుడని తహశీల్దార్ మురళీ మోహన్, ఎంపిడిఒ త్రినాథ్, ఎస్ఐ రవివర్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటి బస్టాండ్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బొరివంకలో మండల దళిత సంఘం అధ్యక్షుడు మద్దిలి కేశవరావు, బలగ నారాయణ మూర్తి, బలగ ధర్మారావు, బలగ సూర్యనారాయణ, బెజ్జిపుట్టుగలో పొందల కృష్ణారావు, ఎఒ నరసింహ మూర్తి, గొండ్యాల రామూర్తి, స్థానిక కల్యాణి ఆంగ్ల పాఠశాలలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : మండలంలోని పరశురాపురంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి గ్రామ పెద్దలు కర్నిక గాంధీ, చల్లా రామారావు, వాకాడ రామారావు, ఉపాధ్యాయులు వాకాడ ధనుంజయరెడ్డి, స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి, పేడాడ విద్యాసంస్థల ఆవరణలో ఛైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కరస్పాడెంట్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, టెక్కలి డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : విద్యా వనరుల కేంద్రంలోని అంబేద్కర్ చిత్రపటానికి ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం, ఎంఆర్‌సి సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం సిటీ : అంబేద్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న ఐద్వా నగర కమిటీ

పలాస : స్థానిక బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి అప్పలరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మీసాల సురేష్, వైసిపి నాయకులు, అలాగే పలాసలోని అంబేద్కర్ విగ్రహానికి ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పట్టణ టిడిపి కార్యదర్శి సప్ప నవీన్‌లు, అలాగే పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో అంబేద్కర్ చిత్రపటానికి ఛైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్, ఇంజినీర్లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని హుకుంపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు మెట్ట మోహనరావు, ఉపాధ్యాయులు సుభాష్, సుగుణ, సత్యనారాయణ, స్వాతి పూమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి రూరల్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ఆధ్వర్యాన...

టెక్కలి రూరల్ : సాంఘిక అసమానతలపై అలుపెరగని పోరాటయోధుడు, నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతదేశ ప్రథమ న్యాయశాఖ మంత్రి, కార్మిక హక్కుల ప్రధాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సభ టెక్కలి ఆది ఆంధ్ర వీధిలో సిపిఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రాజ్యాంగాన్ని కాపాడుకొందాం, మతోన్మాదాన్ని వ్యతిరేకిద్దాం, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, ఉర్జాన దుర్గాప్రసాద్, గ్రామ పెద్దలు యాగాటి శివరావు, యర్ర వెంకటరావు, పినిమింటి రామారావు, దాసరి వైకుంఠరావు, దండాసి ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్టాండ్ స్టిక్‌తో ప్రసాద్

హెల్పింగ్ హ్యాండ్స్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

అభాగ్యులను ఆదుకోవడంలో ముందుండే మండలంలోని హ్యాల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ మరోసారి తన ఉదారత చాటుకుంది. పక్షవాతంతో బాధపడుతున్న బొరివంకకు చెందిన ప్రసాద్ నడవడానికి ఇబ్బందిపడుతున్న విషయాన్ని సంస్థ సభ్యుల ద్వారా తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ ప్రసాద్‌కు అండగా నిలిచింది. లోళ్లపుట్టుగకు చెందిన లోళ్ల సోమేశ్వరి ఆర్థిక సాయంతో ప్రసాద్ నడిచేందుకు అవసరమైన స్టాండ్ స్టిక్‌ను శనివారం అందించారు. సమస్య తెలుసుని స్పందించిన సోమేశ్వరి కుమారుడు లోళ్ల కళ్యాణ్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలోని టిటిడిసి కార్యాలయంలో సెర్ప్ సిఇఒ, ఎసిఇఒ, పీడీ ఆదేశాల మేరకు జిల్లాలో తొమ్మిది మండలాలకు విజన్ బిల్డింగ్‌పై నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎచ్చెర్ల టిటిడిసిలో నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా రాబోయే ఐదేళ్లకు సంబంధించి భవిష్యత్ ప్రణాళిక (విజన్ బిల్డింగ్) చేపట్టారు. మండల సమాఖ్య, గ్రామ సంఘాల స్థాయిలో గ్రామాల్లో అవసరమైన విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సుస్థిర జీవనోపాదులు, సామాజిక భద్రత, సామర్థ్యాల పెంపుదల వంటి అంశాలపై శిక్షణలో వివరించడం జరుగుతుంది. గ్రామాల అభివృద్ధికి సంబంధించి విజన్ బిల్డింగ్ శిక్షణలో తయారు చేసిన ప్రణాళికలను డిఆర్‌డిఎ, సెర్ప్ వారికి ప్రతిపాదన పంపించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అధికారులు శిక్షణ ఇవ్వనున్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

లావేరు: ఈ నెల 8న టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ 50వ జన్మదినం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి జరగనున్న రక్తదాన శిబిరంలో యువత పాల్గొనాలని టిడిపి మండల నాయకుడు కడుపుకుట్ల రమణబాబు తెలిపారు. అలాగే నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని నేత్ర రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పత్రాలు సక్రమంగా లేకుంటే చర్యలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎరువులకు సంబంధించిన పత్రాలు సరిలేకుంటే చర్యలు తప్పవని టెక్కలి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్ మోహనరావు, మండల ఎఒ డి.విజయ్‌భాస్కర్ షాపుల యజమానులకు హెచ్చరించారు. మండలంలోని జె.ఆర్.పురం, కోష్ట గ్రామాల్లో ఇంటర్నల్ స్క్వాడ్‌గా ఎరువుల దుకాణాలు తనిఖీ నిర్వహించారు. ఎరువుల షాపులు తనిఖీ చేశారు. రబీ సీజన్ మొదలైనందున ఎరువులు డిమాండ్ ఎక్కువగా ఉన్నందున రిజిస్టర్‌లు, ఈపాస్ మెషిన్‌లో స్టాక్ అప్డేట్‌గా ఉండాలని షాపు యజమానులకు సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కోత మహాలక్ష్మి అప్పన్న మెరియల్ సర్వీసు సంస్థ ద్వారా నగదు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు శనివారం అందజేశారు. ఉత్తమ ప్రతిభకు చక్క సమగ్నకు రూ.6 వేలు, వంజరాపు మనోజ్‌కుమార్‌కు రూ.5 వేలు, నక్కల నవదీప్‌కు రూ.4 వేలు అందజేశారు. బాలికల విభాగంలో గౌడు శణ్ముఖప్రియకు రూ.5 వేలు, గాలి నవ్యశ్రీకి రూ.4 వేలు, వాడరేవు తరణికుమారి రూ.3 వేలు పురస్కారాలు అందజేశారు. గ్రూప్ సబ్జెక్టుల్లో పంగ మనోజ్‌కుమార్‌కు రూ.5 వేలు, బెండి కామేశ్వరరావుకు రూ.4 వేలు, కర్రి యోగానందకు రూ.3 వేలు బహుమతులు ప్రకటించారు మొత్తం నగదు బహుమతులను సంస్థ అధ్యక్షుడు కోత చిన్నబాబు, కార్యదర్శి కోత మధుసూదనరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు.

నేడు యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం

కోటబొమ్మాళి: మెళియాపుట్టిలో ఆదివారం 41వ యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గొండు నారాయణరావు అన్నారు. శనివారం కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో యుటిఎఫ్ పోస్టర్లను అవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సభ్యులు గణపతిరావు, ఆనందరావు, పాపారావు పాల్గొన్నారు.

వైసిపి టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా బలరాం నాయుడు

బలరాం నాయుడు

బూర్జ: వైసిపి జిల్లా టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా పాలవలస సర్పంచ్ ప్రతినిధి జల్లు బలరాం నాయుడు నియమితులైనట్టు బూర్జ వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు శనివారం తెలిపారు. బలరాంనాయుడు తండ్రి జల్లు అప్పలస్వామి నాయుడు పాలవలస పంచాయతీకి 40 ఏళ్ల సర్పంచ్‌గా సేవలను అందజేశారు. బలరాంనాయుడు డిసిఎంఎస్ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు.

పలాసలో సంతకాల సేకరణ

పలాస: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమం, రచ్చబండ ద్వారా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు బమ్మిడి సంతోష్‌కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ ఆధ్వర్యాన శనివారం ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. మాజీ మంత్రి, వైసిపి డాక్టర్ల సెల్ రాష్ట్ర అధ్యక్షులు అప్పలరాజు పాల్గొని తన నిరసన సంతకాన్ని చేశారు.

డిప్యూటీ ఎంపిడిఒగా అప్పన్న

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వి.అప్పన్న డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. గ్రేడ్-వన్ పంచాయతీ కార్యదర్శిగా ఎం.జె.వలస సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. అలాగే జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి హోదాలో కొత్త బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి- మందస

పోరాట మార్గంలో యుటిఎఫ్ సాధించిన విజయాలే అని చెప్పడంలో అతిశయోక్తి లేదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్ అన్నారు. మందస ఉన్నత పాఠశాలలో శనివారం మండల నూతన కార్యవర్గం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా జన్ని సోమేశ్వరరావు, అధ్యక్షునిగా జగదీష్ బడిత్య, సహాధ్యక్షునిగా ధర్మాపు కిరణ్, ప్రియాంక మహారాణా, ప్రధాన కార్యదర్శిగా దాసరి ఈశ్వరరావు, కోశాధికారిగా సోమనాథ్ శిష్టు, సిపిఎస్ కన్వీనర్‌గా సారి ప్రేమ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ ఉపాధ్యాయులు గున్న గంగాధరరావు మాట్లాడుతూ మండలంలో యుపి పాఠశాలల సాధన కోసం అలుపెరగని పోరాటం చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మండల పూర్వ గౌరవాధ్యక్షులు జయరాం మాలి, కొర్ల తేజేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి: టెక్కలి మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక స్థానిక మెయిన్‌బజార్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. మండలశాఖ గౌరవాధ్యక్షునిగా బమ్మిడి అరుణ్‌కుమార్, అధ్యక్షునిగా డొంకాన పాపారావు, ప్రధాన కార్యదర్శిగా దవళ లక్ష్మీనారాయణ, సహాధ్యక్షునిగా పడాల గణపతిరావు, నంబూరు ప్రభావతి, కోశాధికారిగా పోలాకి రుషి, మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, బాలక శంకరరావులు వ్యవహరించారు. నూతన కమిటీని సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, తమ్మినేని వైకుంఠరావు, మారం కుమారస్వామి, కోరాడ మోహనరావు అభినందించారు.

విద్యార్థులకు తల్లిదండ్రుల మందలింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలకు చెందిన బస్సును శనివారం సాయంత్రం విద్యార్థినుల తల్లిదండ్రులు అడ్డుకొని విద్యార్థులను మందలించారు. పట్టణంలోని కొత్తకోట వారి వీధి సమీపంలోని ప్రధాన రహదారిపై శ్రీ చైతన్య కళాశాల బస్సును అడ్డుకొని రహదారిపై నిలిపివేయడంతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళంలోని శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులను ప్రతిరోజు కళాశాలకు తీసుకువెళ్లి తీసుకురావడానికి ఆమదాలవలస పట్టణానికి ఒక బస్సును నడుపుతున్నారు. ఇదే బస్సులో ప్రతిరోజు ప్రయాణం సాగిస్తున్న విద్యార్థినులను విద్యార్థులు పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు తెలియ జేయడంతో పలువురు తల్లిదండ్రులు సాయంత్రం పట్టణానికి బస్సువచ్చిన సమయంలో కొత్తకోట వారి వీధి ప్రధాన రహదారి వద్దకు చేరుకొని శ్రీ చైతన్య బస్సును అడ్డగించారు. బస్సులో ఉన్న పలువురు యువకులను మందలించి భవిష్యత్‌లో తమ ఆడబిడ్డలపై ప్రవర్తన మార్చుకోకపోతే శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులపై దాడి చేయకుండా యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలని బస్సును కూడా నిలుపుదల చేయటం వలన ప్రజలకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని డ్రైవర్ కోరడంతో బాలికల తల్లి దండ్రులు బస్సులు విడిచి పెట్టి అక్కడి నుండి వెనుదిరిగారు.

శ్రీ చైతన్య స్కూల్ బస్సును అడ్డుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- జి.సిగడాం రూరల్

రైతులకు యూరియా కొరత తీర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపిటిసి కుమరాపు రమేష్ నాయుడు, కీర్తి తవుడమ్మ, సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, తొత్తడి రామారావు, కంది రమాదేవి మండిపడ్డారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మీసాల సత్యవతి సమక్షంలో, ఎంపిడిఒ జి.రామకృష్ణారావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సకాలంలో యూరియా అందించలేకపోతుందని, రైతుసేవా కేంద్రాల వద్ద రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, అధికార పార్టీ నాయకులకే ఎరువు అందుతుందని, వారు ఎవరికి ఇవ్వమంటే వారికే ఇస్తున్నారని మండల వ్యవసాయాధికారిని ప్రశ్నించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రజా ప్రతినిధులు, ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణితో విధులు నిర్వహిస్తున్నారని జెడ్‌పిటిసి కాయల రమణ సభ దృష్టికి తీసుకు వచ్చారు. పలువురు అధికారులు నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, డిటి ఎన్.నిర్మల, వైస్ ఎంపిపి మీసాల స్వాద్వీమణి, తోలేటి వెంకటరావు, ఎంఇఒ అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఎఇ కుసుమ, లతాశ్రీ, యువరాజు, ఐసి గేదేల పురుషోత్తం, ఎపిఎం రెడ్డి రామకృష్ణ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రణస్థలం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి అన్ని శాఖలు, అంశాల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ గ్రామస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా విధులను ఈనెలాఖరులోగా నిర్వహించాలని సూచించారు. పల్లెల్లో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాన్ని తాగునీటి, విద్యుత్ సమస్యలతో పాటు పలు సమస్యలపై చేపట్టిన పనులు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కరించి ముందుకెళ్లాలన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ ఎడిఎ శ్రీనివాసరావు, ఎఒ భాస్కరరావు మాట్లాడుతూ పంట పొలాలకు ఎరువుల వినియోగాన్ని దశలవారీగా తగ్గించేందుకు ప్రభుత్వం కొత్త సంస్కరణలు చేపట్టిందని, సారవంతమైన భూముల స్వభావం దెబ్బతినకుండా ఉండేందుకు, కాలుష్యం లేకుండా మార్పులు చేపడుతోందన్నారు. అందులో భాగంగా చిన్నచిన్న గుళికల రూపంలో ఉండే యూరియా స్థానంలో లిక్విడ్ నానో యూరియాను, డిఎపిని అందుబాటులోకి తీసుకొచ్చిందని, దీని వినియోగంతో సాగు ఖర్చు తగ్గడమే కాకుండా అధిక దిగుబడికి దోహదపడుతుందన్నారు. వైద్యాధికారి జనార్ధనరావు మాట్లాడుతూ 100 శాతం టీకాలు ప్రక్రియ జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఆశ వర్కర్ల ఖాళీలు నింపేందుకు రిక్రూట్‌మెంట్ జరిగిందని, త్వరలోనే నియామాలను చేపట్టడం జరుగుతుందన్నారు. సిహెచ్‌సి సూపరింటిండెంట్ డాక్టర్ లలిత మాట్లాడుతూ ఆస్పత్రిలో స్పెషలిస్టులందరూ అందుబాటులో ఉన్నారని, అలాగే ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఇఒ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ రానున్న పదోతరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పలు శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో చదివి వినిపించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, వైస్ ఎంపిపిలు కామరాజు, భుజంగరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదు

కంచిలి: మండల పరిధిలోని భైరిపురం పంచాయతీతో పాటు పలుచోట్ల రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, తూనికల్లో సైతం తేడాలు వస్తున్నాయని సభ్యులు మండల సమావేశంలో ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిడిఒ వి.తిరుమలరావు, తహశీల్దార్ రమేష్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరగడంలేదని, కొల్లూరులో పారిశుధ్యం పై చర్యలు చేపట్టాలని, రబీ సీజన్‌కు ఆపరాలు విత్తనాలు అందజేయాలని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదులు ఉంటే నేరుగా తెలియజేయాలని సూచించారు. ఎఒ కె.సురేష్ మాట్లాడుతూ మండలంలో 9880 ఎకరాలకు ఈ క్రాప్ పూర్తి చేస్తామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు సక్రమంగా పథకాలు అందజేయడంతో పాటు సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశానికి విధిగా 18 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉన్నా... ఎక్సైజ్, అటవీశాఖ, ఆర్‌టిసి, సాంఘిక సంక్షేమశాఖ, ఆర్అండ్‌బి శాఖ అధికారులు గైర్హాజరయ్యారు.

జి.సిగడాం రూరల్ : అధికారులను నిలదీస్తున్న సభ్యులు

మొక్కుబడిగా మండల సమావేశం

టెక్కిలి రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆట్లా సరోజనమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశం మొక్కుబడిగా సాగింది. ముందుగా ఉదయం ఎంపిటిసిలు హాజరు కావపడుతో రెండో పూట సాయంత్రానికి సమావేశం వాయిదా వేశారు. సాయంత్రం కూడా ఏడుగురు ఎంపిటిసిలు ఎంపిపితో కోరం చేసి మొక్కుబడిగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదన చేశారు తప్ప ప్రజా సమస్యలపై చర్చించలేదు. సమావేశంలో ఎంపిడిఒ రేణుక, ఎఎంసి ఛైర్మన్ బగాది శేషగిరిరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- లావేరు

అప్పారావు (ఫైల్)

మండలం చిగురు కొత్తపల్లి గ్రామానికి చెందిన గిడుతూరి అప్పారావు (59) గ్రామానికి సమీపంలో ఉన్న మహదాసు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఒకవైపు అనారోగ్యం, మరోవైపు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లడం, రావడం చేస్తుంటాడని తెలిపారు. ఈనెల 1న మూత్ర విసర్జనకు రాత్రి 8 గంటల సమయంలో వెళ్లిన వృద్ధుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో అప్పటి నుంచి పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ వృద్ధుడు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చెరువు సమీపంలో పొలం పనులు చేస్తున్న స్థానికులకు దుర్వాసన రావడంతో చెరువు వద్దకు వెళ్లి చూశారు. చెరువులో శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. బయటికి తీసి చూడగా అప్పారావుగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. కుమారుడు సూరప్పడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఎస్.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు చోరీలకు పాల్పడిన వ్యక్తిని శనివారం అరెస్టు చేశామని సిఐ ఎ.విజయ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని శనివారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. టెక్కలి పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న చోరీల కేసులో బెనియా జగబంధు (పోతురాజు)ని మెళియాపుట్టిలో అరెస్టు చేశామన్నారు. ఆయన వద్ద నుంచి 78.205 గ్రాముల బంగారం ఆభరణాలు, 38 గ్రాముల వెండి, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం రిమాండ్‌కు తరలించామన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ అప్పన్న

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి- పొందూరు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ ఎంపిడిఒ, జిఎస్‌డబ్ల్యుఎస్ దుంపల అప్పన్న పేర్కొన్నారు. శనివారం మండలంలోని మలకాం, తండ్యాం గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అలాగే రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, బయోమెట్రిక్ హాజరును తప్పని సరిగా వేయాలన్నారు. అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు.

నేడు పోరుబాటపై కవితా పఠనం

ప్రజాశక్తి- అరసవల్లి

ఆదివారం ఉదయం 10:30 గంటలకు స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో పోరుబాటకై కవితా పఠనం జరుగుతుందని సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్ట్, సరుబుజ్జిలి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న నిరసనను ప్రతిభంబించేలా కవుల స్పందన ఉంటుందని, అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న విప్ అశోక్

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

యువత ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, బెందాళం అశోక్ సూచించారు. కవిటిలోని ఎస్‌విజె ఆవరణంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగులు ఇంగ్లీష్‌తో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల సృష్టి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా నైపుణ్య అధికారి యు. సాయికుమార్ మాట్లాడుతూ ప్రతి నాలుగు నెలలకు జాబ్ మేళాలు నిర్వహించి మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేళాకు మొత్తం 317 మంది హాజరుగా, 18 కంపెనీల్లో 167 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఎస్‌విజె కరస్పాండెంట్ బెందాళం కింగ్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించి ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామారావు మాస్టార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- పొందూరు

ఎపిటిఎఫ్‌లో క్రియాశీల కార్యకర్తగా అంకితభావంతో పప్పల రామారావు మాస్టార్ పనిచేశారని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అన్నారు. మండలం తోలాపిలో రామారావు మాస్టార్ సంతాప సభను శనివారం ఎపిటిఎఫ్ పొందూరు మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎపిటిఎఫ్‌కు రామారావు మాస్టార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు మొగదాల రమణరావు, మండల పూర్వ ప్రధాన కార్యదర్శులు దుంపల శ్రీనివాసరావు, పొన్నాడ తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు పేడాడ లక్ష్మణరావు, పప్పల తిరు మలరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్‌కుమార్, తూతిక పాపారావు, విశ్రాంత ఆర్‌ఐఒ దుంపల శ్యామలరావు, పిఎస్.నాగరాజు, బొడ్డేపల్లి సూర్యనారాయణ, లోలుగు వెంకటేష్, దుంపల రంగారావు, దుంపల నూకరాజు, గోవిందరావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం

ఎచ్చెర్ల: కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన పట్టణాలు, ఆరోగ్యవంతమైన నేలలు అనే నేపథ్యంలో శ్రీకాకుళంలోని సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు నేల ప్రాముఖ్యతను, విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నేల ప్రాముఖ్యతపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు శ్రీకాకుళం ఆర్‌టిసి బస్టాండ్ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. డే అండ్ నైట్ కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు కార్యక్ర మంలో కళాశాల అసోసియేట్ డీన్ నారన్నాయుడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి సన్మానం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం టిడిపిలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సరైన సమయంలో సరైన గుర్తింపు లభిస్తుందని అనడానికి ఉదాహరణ కొండ శంకర్‌రెడ్డి అని టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పత్రీ తవిటయ్య, నందిగాం కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని బెల్లుపడాలో ఇటీవల నియమితులైన శంకర్‌రెడ్డికి శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లీలారాణి, గేదెల శేఖర్, కౌన్సిలర్ ప్రతినిధులు కాళ్ల జయదేవ్, కార్పొరేషన్ డైరెక్టర్ ఉనా సంతోష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలు నేర్పాలి

అరసవల్లి: చిన్నప్పటి నుంచే విద్యార్థులకు మానవతా విలువలు, సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించి పాఠశాలలో ఉపాధ్యాయులు నేర్పించాల్సిన అవసరం ఉందని వరల్డ్ టీచర్స్ ట్రస్ట్ జగద్గురు పీఠం రాష్ట్ర కార్యదర్శి బిఆర్‌కె రాజు అన్నారు. నగరంలో బాలబాను విద్యాలయంలో శనివారం సివివి గురుపూజ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు మొదట సెల్‌ఫోన్లు విడిచిపెట్టి ఆదర్శంగా ఉంటే తమ పిల్లలు కూడా తల్లిదండ్రులను చూసి నేర్చుకునే పరిస్థితి రావాలని, నేటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులందరూ ఇళ్ల వద్ద సెల్‌ఫోన్‌తోనే జీవనం గడుపు తున్నారన్నారు. కులపతి కృష్ణ మాచార్యుల శతజయంతి సందర్భంగా 20 మంది రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్ నారాయణ చార్యులు, యువిఎన్ రాజు, ఎస్ఎస్ రాము, జివివి రామేశ్వర్, బాలబాను విద్యాలయం ట్రస్ట్ ప్రతినిధులు నారాయణరావు పాల్గొన్నారు.

గోపికి 'కవి కేసరి' పురస్కారం

కవిటి: చిన్నపదాలతో చిరునవ్వులను పూయిస్తూ, సాహితీ ప్రియుల హృదయాల్లో ఇంద్రధనుస్సుల్లాంటి భావాలను నింపుతున్న లఘుకవి మొర్రి గోపి మరో ఘనతను సాధించారు. హరివిల్లు కవితా ప్రక్రియలో 1500 కవితలు పూర్తి చేసి, భద్రాద్రి సాహితి వేదిక తెలంగాణ వారు ప్రదానం చేసే 'హరివిల్లు కవి కేసరి పురస్కారం' అందుకున్నారు. కవిటికి చెందిన గోపి ప్రస్తుతం ముత్యాలపేట జెడ్‌పిహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా విధులు నిర్వహిస్తున్నారు. వృత్తిలో బిజీగా ఉన్నా ఆరేళ్లుగా నిరంతర సాహిత్య సాధన ఆయనను ఈ విజయంతో ముద్దాడిందని పలువురు అభినందించారు. ఈ పురస్కారాన్ని వేదిక అధ్యక్షులు సీర హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిట్టి మధు, వ్యవస్థాపక అధ్యక్షులు మోహనరావు, హరివిల్లు రూపకర్త మామిడి రమేష్ ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. మొర్రి గోపి ప్రతిభను ప్రశంసిస్తూ మండల విద్యాశాఖాధికారి ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయులు చిత్రిఈశ్వరరావు, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు శుభాకాంక్షలు తెలిపారు.

నాటికలు వేయడానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు 2025 సంవత్సరానికి బాపూజీ కళామందిర్‌లో రెండవ రోజు కూడా కొనసాగాయి. అమ్మ చెక్కిన బొమ్మ నాటిక, ఎవరు? సాంఘిక నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గురుగుబెల్లి యతి రాజులు సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరాజు భీశెట్టి రచించిన గోవాడ వెంకట్ దర్శకత్వంలో అమ్మ చెక్కిన బొమ్మ నాటిక ప్రదర్శన ప్రేక్షకులకు ఆహ్లాదకరంగా, ఆలోచింప చేసే విధంగా ప్రదర్శించారు. అమ్మ చెక్కిన బొమ్మ నాటికలో సృష్టిలో ఉత్తమమైనది మానవజన్మ ఆ మానవ జన్మలో స్త్రీ లేదా పురుషుల కోసం మనం మాట్లాడుకుంటూ ఉంటాం, నాటి పురాణకాలం నుంచి నేటి వరకు, ఆది మానవ యుగం నుంచి ఇప్పటివరకు స్త్రీ పురుషులే కాకుండా మానవజాతిలో దాదాపు 20 రకాల శరీర తత్వాలు కలిగిన మనుషులు ఉన్నారని, వారివారి మనసత్వాలు బట్టి ఇలా నడుచుకుంటారని ప్రతి ఒక్కరికి గౌరవించాల్సిన బాధ్యత అందరికీ ఉందని తెలియజేసే సందేశాత్మక నాటిక

మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

అద్భుతంగా ప్రదర్శించారు. అదేవిధంగా కలగ గణేష్ యాదవ్ సౌజన్యంతో రెండవ నాటిక తెనాలికి చెందిన అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ ఆరాధ్యుల తేజస్వి రచనలో అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో ఎవరు? నాటిక కూడా ఒక ప్రమాదంలో చిన్నప్పుడు అనాథ వ్యక్తి కాపాడిన సంఘటనలో ఆ అనాథకి, కుటుంబానికి కుటుంబంలో అన్ని గౌరవం సంపద భాగస్వామ్యం ఉంటుందన్న పెద్ద కొడుక్కి ఆ కుటుంబంలోనే వ్యతిరేకత వచ్చి అనాథకు ఆ విధంగా ఆస్తిలో వాటా ఇవ్వకూడదన్న సంఘటనతో కుటుంబం విడిపోయే పరిస్థితికి ఎదురై, మరలా ఆ అనాథ ఆ కుటుంబాన్ని ఎలా ఆదుకుంటాడో ఎవరు? నాటికలో అద్భుతంగా ప్రదర్శింప జేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ నేడు సినిమాల్లో నటించిన పెద్దపెద్ద సినీతారలందరూ ఒకనాటి రంగస్థలంపైన నటించిన వారేనన్నారు. సినీమా నటులు కన్నా రంగస్థలం నటులు మంచి సందేశాత్మక ప్రదర్శనలు ఇస్తారన్నారు. యువత రంగస్థలం నటనపై ఆశక్తి చూపించక పోవడం విచారకరమన్నారు. అదే విధంగా సినిమాలో నటించిన నటులందరికి రంగస్థలం అనేది ప్రాథమిక విద్యలో ఒక అక్షరాభ్యాసం లాంటిదన్నారు. పౌరాణిక నాటకంలో గాని, సాంఘిక నాటకంలోగాని వారు నటించేటప్పుడు కళ్లకు కట్టినట్లుగా, సందేశాత్మంగా నటిస్తారన్నారు. నాటికలు ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు. మిమిక్రి కళాకారుడు ఎల్.నందికేశ్వరరావు రచించిన మిమిక్రీలో 'నేను విన్నవి.. కన్నవి' పుస్తకాన్ని మాజీమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గార ఎంపిపి రఘురాం, చల్లా శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు ఎల్ రామలింగస్వామి, సత్యవతి, పన్నాల నరసింహామూర్తి, రామచంద్ర దేవ్, కంచరన్న అప్పారావు, నల్లి ధర్మారావు, ఇంజరాపు రమణారావు, బి.ఎ. మోహన రావు, గుమ్మా నగేష్, బి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కవిటి : మాట్లాడుతున్న ఈగల్ క్లబ్ కన్వీనర్

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

ప్రజాశక్తి- కవిటి

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యాన 'మాదక ద్రవ్యాల వినియోగం -ప్రమాదం' అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నపాటి వ్యామోహమే భవిష్యత్‌ని అంధకారంలో నెడుతుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల దొంగతనం, తీవ్రవాద ప్రవృత్తులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో యువతే ఎక్కువగా ఇరుక్కుపోతున్నారన్నారు. దేశ భవిష్యత్‌ను నాశనం చేసే వ్యసనాలకు కట్టడి అవసరమని పిలుపునిచ్చారు. మహిళ పోలీస్ కె.ప్రియ మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో చదువుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఒకసారి పెడదోవ పట్టితే తిరిగి భవిష్యత్ చీకట్లోకి వెళ్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని ఈగల్ క్లబ్ కన్వీనర్ బి.శ్రీనుబాబు సమన్వయం చేశారు. కో-కన్వీనర్ జి.విష్ణు మూర్తి, పి.హరి, కె.ఉగాదినాయుడు, డి. అనసూయ, జె.పాపారావు, కె.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, బి.అంజన, జనార్ధనరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ సామాజిక బాధ్యత

ఇచ్ఛాపురం: బాల్య వివాహాల నియంత్రణ సామాజిక బాధతగా గుర్తించాలని మహిళా పోలీసు సూర్యకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈగల్ క్లబ్ సమన్వయకర్త నట్ట బాపూజీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, ఎజిఎంఒ ప్రియ, సుధాకర్, ఎఎన్ఎం ధనలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒ రజనీకుమారి పాల్గొన్నారు.

కొత్తూరు : బాల్య వివాహాలు నేరమని ఐసిడిఎస్ పిఒ ఉమాజానకి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.వి.రాంప్రసాద్, వైద్యులు పి.ప్రసన్న కుమార్, భవానీప్రసాద్, హెచ్ఎం ఎ.గోవిందరావు, వార్డెన్ ఉమామహేశ్వరరావు, పిఎస్ఆర్ఒ సురేష్ పాల్గొన్నారు.

గొట్టిపల్లిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో శ్రీకాకుళం మెడీకవర్ సౌజన్యంతో సర్పంచ్ నిమ్మక కళావతి అధ్యక్షతన శనివారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ముందుగా వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ప్రారంభించారు. వైద్యులు ఎం.పల్లవి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొయిలాపు సంజీవరావు, లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, సవర ఫాల్గుణరావు, పి.వెంకటకృష్ణ, చిరంజీవి, బి.నీలవేణి, ఎం.హైమావతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకమైన 'ఇంటర్ క్యాంపస్ స్పోర్ట్స్ టోర్నమెంట్' మూడవ రోజూ ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో కొనసాగుతున్నాయి. శనివారం ఉత్కంఠభరితంగా జరుగుతుంది. శ్రీకాకుళం, నూజివీడు మధ్య జరిగిన మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. వాలీబాల్, చెస్ వంటి పలు క్రీడాంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధనబాలాజీ, ఎఒ డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు దిలీప్ కుమార్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి- జి.సిగడాం రూరల్

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయనగర పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పనాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రం బలిజీ కళ్యాణ మండపంలో టిడిపి మండల అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్ అధ్యర్వంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, కుదిరెళ్ల బుజ్జి, టంకాల మౌళీశ్వరరావు, మజ్జి కన్నం నాయుడు, సి.గోవిందరావు, గౌరీ, మీసాల మోహన్, బోగాది అప్పలనాయుడు, మక్క నారాయణ రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న వనజ

సామాజిక బాధ్యత పెరుగుతుంది

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జాతీయ సేవ పథకం ద్వారా వాలంటరీలకు సామాజిక బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వనజ అన్నారు. మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సేవా ప్రత్యేక పథకం ఆధ్వర్యాన శనివారం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వల్ల మీరు నేర్చుకున్నది, గ్రామాలు పరిశుభ్రత, అవగాహన సదస్సులు వంటి కార్యక్రమాల ద్వారా మీకు నాయకత్వ లక్షణాలు వస్తాయని అన్నారు. వ్యక్తిగత బాధ్యత కన్నా... సామాజిక బాధ్యత ఉండాలని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యలక్ష్మి, ఝాన్సీ, రాంబాబు, శోభారాణి, అలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రూప్‌సుందర్ పాల్గొన్నారు.

కొత్తూరు : జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మండలంలోని మహర్తాపురం, కుంటిభద్ర కాలనీలో ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఉమాజానకి, సూపర్‌వైజర్ కౌసల్య, అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వనజాక్షి, ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు, జి.మహేష్, కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జ్ఞానభారతి పాఠశాల సెక్రెటరీ సిఇఒ జోహార్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన వార్షిక క్రీడా వేడుకల ముగింపు సంబరాలు శనివారంతో ముగిశాయి. వారం రోజులు పాటు పాఠశాల విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుక సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎంఇఒ కె.అప్పారావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యకే ప్రాధాన్యం ఇస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు వారం రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల మానసిక,

విజేతలను అభినందిస్తున్న జోహార్‌ఖాన్

శారీరక దృఢత్వానికి, ముఖ్యంగా భావోద్వేగాల నియంత్రణకు క్రీడలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

విగ్నేష్ పూజిత వినూత్న

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌సిఇఆర్‌టి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్త ఆధ్వర్యంలో గత నెలలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన దేశంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ విద్యార్థి విజ్ఞాన్ మందన్ (వివిఎం) రెండోదశ పరీక్షలో నగరానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఆరో తరగతి విద్యార్థులు వారణాసి పూజిత, టి.గిరివర్ధన్ విఘ్నేష్, పొందూరు శ్రీ చైతన్య స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని దున్న వినూత్నలు రాష్ట్రస్థాయి క్యాంపుకు అర్హత సాధించినట్లు వివిఎం జిల్లా కోఆర్డినేట్ ఎ.పున్నయ్య ప్రకటనలో తెలియజేశారు. మొదటిస్థాయి నుంచి రెండవ దశకు కేవలం 25 శాతం విద్యార్థులే అర్హత సాధించగా, రెండవ దశలో 90 శాతానికిపైగా కోత విధించిన అనంతరం ఈ విద్యార్థులు విజేతలుగా నిలవడం గొప్ప విషయమన్నారు. దున్న వినూత్న జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి రెండవసారి ఎంపిక కావడం విశేషమన్నారు. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, సర్వశిక్షా అభియాన్ ఎపిసి పి.వేణుగోపాలరావు అభినందనలు తెలియజేశారు.

వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యే పైప్‌లైన్‌కు లీకులు ఏర్పడడంతో తాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి నాగావళి నది నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండగా మొదలవలస గ్రామానికి ఆనుకుని ఉన్న శ్మశానవాటిక సమీపంలో పైప్‌లైన్‌కు లీక్ ఏర్పడడంతో పెద్దఎత్తున తాగునీరు వృథా అవుతుంది. దీంతో కొద్ది రోజులుగా గ్రామానికి సరఫరా అయ్యే తాగునీరు తగ్గిపోతుండడంతో సరిపడా తాగునీరు లభించక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి పైప్‌లైన్‌కు ఏర్పడ్డ లీకులను అరికట్టి గ్రామానికి సరిపడా తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- మందస

రైతులకు అవగాహన కల్పించాలని వంశధార సాగునీరు సాధన కమిటీ అధ్యక్షులు మార్పు మన్మథరావు అన్నారు. మండలంలోని హరిపురం మార్పు గ్రంథాలయంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. వరి నూర్పులు తర్వాత రైతులతో సమావేశాలు, సభలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వెంకటరావు, కొర్ల హేమారావు చౌదరి, మజ్జి బాబూరావు, వాయలపల్లి మాధవరావు, కొవ్వూరు దశరథి, పెద్దింటి శశిధరవర్మ, కొర్నాన గంగాధరరావు, చౌదరి మురళీకృష్ణ, చప్ప జీవనరావు, దేవాడ నారాయణరావు, జయ, రాము పాల్గొన్నారు.

మోహనరావు పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కొసమాలకు చెందిన మాజీ సర్పంచ్ అంకడాల లోకనాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి లోకనాథం చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో జాడుపల్లి ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, వెంకటరావు, ధర్మారావు, ధనుంజయ పాల్గొన్నారు.

జగన్నాయకులు...

సంతబొమ్మాళి: మండలంలోని ఎం.మరువాడకు చెందిన వైసిపి కార్యకర్తలు చోడిపిల్లి యర్రమ్మ, నకిలి యర్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కెల్లి జగన్నాయకులు శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగన్నాయకులు, వైద్యంలో నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, విద్యార్థి విభాగం టెక్కలి నియోజకవర్గ అధ్యక్షుడు నక్కిట్ల నరేష్, మరువాడ వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, మేఘవరం ఎంపిటిసి సూరాడ రాజారావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కవిటి: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సిఆర్‌ఎంటిలు కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ మురళీమోహన్, ఎంఇఒ ధనుంజయ మజ్జిలకు శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం సిఆర్‌ఎంటిలు మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచి, గ్రాడ్యూటీ, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఏ, బి క్లస్టర్ విధానాన్ని విరమించుకుని సిఆర్‌ఎంటిల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటిలు బి.తులసీదాస్, బి.రామకృష్ణ, ఎస్.తనూజ పాల్గొన్నారు.

రైస్, ఆయిల్ మిల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా గోవిందరావు

నందిగాం: మండలంలోని పెంటపూరులో రైస్, ఆయిల్ మిల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎస్.గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రైస్, ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్.ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి కొల్లి ఎల్లయ్య ఆధ్వర్యాన శనివారం ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పి.కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా ఎన్.అప్పారావు, కూర్మాపు ఆఫీసు వీరితో పాటు 8 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సిఐటియు పోస్టర్‌ను ఆవిష్కరించారు.